# అంతస్థూ అంతఃకరణా......పారనంది.....

7/150

*ప్రేమించాడు ; హృదయం ఉన్నా అన్యాయమే చే-*
*శాడు ; మానవునిలోని పిరికితనం అలాంటిది.*
*ఆ ప్రేమ ఫలం మాట ఏమిటి? అదే మిగిలిన ఆశ...*

కనకారావుగారింట్లో వివాహం మహా వైభవంగా జరుగుతోంది. ఇంటి ముంగిట మామిడాకుల పచ్చతోరణాలూ, రంగు రంగుల కాగితాల అలంకరణలూ, ట్యూబ్ లైట్లతో నిండిన వెన్నెలలాంటి వెలుగులూ చూడ ముచ్చటగా వుందా వివాహ గృహం.



మంగళ వాయిద్యాలు మిన్నుముట్టుతున్నాయి ఎంతో శ్రావ్యంగా. రంగు రంగుల చీరలతో, చంటిపిల్లల అల్లర్లతో కూడిన కోలాహలంతో వాతావరణం మరింత శోభిస్తోంది.

కన్యాదాత కనకారావు మగ పెళ్ళివారికి సదుపాయాల్లో ఏ లోటు వస్తుందో అన్న భయంతో తడబడుతూ, నౌకర్లందరికీ పని అప్పచెబుతూ హడావిడిగా తిరుగుతున్నాడు. ఆ వూరివారందరూ వివాహానికి ఆహ్వానితులే. వారిలో మొదటివారు బ్రహ్మానందంగారు. కనకారావుకు దూరపు బంధువు కూడాను.

లగ్నసమయం సమీపించింది. ముహూర్తం తెల్లవారుఝాము నాలుగ్గంటల ఇరవై రెండు నిమిషాలకు.

పురోహితుని మంత్రోచ్చారణతో వివాహవేదికంతా మారుమ్రోగుతోంది. ఖరీదైన సిల్కు, షిఫాన్, జార్జెట్ చీరలతో కన్యలూ, ప్రౌఢలూ, ఇంకా ముదుసలి ముత్తయిదువులూ సంతోషంగా వుంటూ గుసగుసలూ, పకపకలూ పోతున్నారు.

ఇంకోవైపు మెత్తని తివాచీపై వివాహానికి సాక్షులుగా పెద్దమనుష్యులైన పురుషపుంగవులు విలువైన జరీ పంచలతోనూ, షాట్లతోనూ తీర్చిదిద్ది కూర్చున్నారు. పురోహితుడు జరిపిస్తున్న తతంగంతో ఎట్టి సంబంధమూ పెట్టుకోకుండా రాజకీయాలూ, ఆ వూరి పార్టీ నాయకత్వమూ, సినిమా విమర్శలూ, ధరవరలూ మొదలయిన విషయాలు చర్చించుకుంటున్నారు.

బ్రహ్మానందంగారు ఒక మూలగా గోడ నానుకుని చుట్ట కాలుస్తూ సందడంతా గమనిస్తూ ఆనందంతో కూడిన దుఃఖాన్ని దేన్నో అనుభవిస్తున్నారు. తన కళ్ళ నిండా తిరుగుతున్న నీటిని ఎవరూ చూడకుండా అడపా తడపా కండువాతో తుడిచేసుకుంటున్నారు. పెళ్ళికూతుర్ని పీటపై కూర్చోపెట్టగానే అందరి కళ్ళూ ఒక్కసారి అటు తిరిగాయి. సన్నాయి మేళం జోరు హెచ్చయింది. పురోహితుని తొందర మరీ లావయింది ముహూర్తం దగ్గరపడిందని. అతను మంగళసూత్రాన్ని చేతితో పుచ్చుకొని పెద్దలందరివద్దకు వెళ్తున్నాడు. ఆ సూత్రాన్నందరూ చేతితో తాకుతున్నారు. ఇందులోని గూఢార్థం వధువు అయిదవతనం వృద్ధవుతుందట.

బ్రహ్మానందంగారు అచ్చట కూర్చున్నారన్న మాటేగాని, ఆయన ఆలోచనలు

# అంతస్థూ— అంతఃకరణా

ఇరవై సంవత్సరాలు వెనక్కుపోయాయి.

## 2

సరిగ్గా ఇరవై ఏళ్లనాటి మాట—అవి అతని యవ్వనపు రోజులు. వేడి రక్తం ప్రతి నరంలోనూ ఉడుకుతూ ప్రవహిస్తూ ఉద్దేశ్యాలను ఉద్రేకపరచే యవ్వనదశ అది. తిండికి, బట్టకు, దర్పాలకూ లోటులేని స్థితిలోనే జన్మించాడు. ఏది కావల్సినా ఇనప్పెట్టెలోవున్న "కరెన్సీ" ఆ వస్తువును తెచ్చిపెట్టేది. తండ్రి సంపన్నుడు.

తనకు వివాహంమీద ధ్యాసే లేదు. ఎన్నో సంబంధాలు వచ్చేవికాని, ఎవళ్లూ తనకు నచ్చక ఒప్పుకోలేదు. తండ్రిమాత్రం పోయిన భార్యనూ, తన వృద్ధాప్యాన్నీ తల్చుకుంటూ బ్రహ్మానందాన్ని గృహస్థుడుగా చూడాలని ఉబలాటపడేమాట వాస్తవం.

వారి బంగళా "బోట్ హౌస్" లో వారి కారు డ్రయివరు రాజా, అతని చెల్లెలు రత్నం—ఇద్దరూ వుంటున్నారు. బ్రహ్మానందం తొలిసారిగా రత్నాన్ని చూచినప్పుడే అనిర్వచనీయమైన తీయని బాధ నొకదాన్ని అనుభవించాడు.

రత్నంలోని యవ్వనం, ఆ యవ్వనాన్ని రెట్టిస్తున్న అందం చూస్తున్నకొద్దీ బ్రహ్మానందం మనసు కేరింతాలు కొట్టేది. రోజు రోజుకూ రత్నం అతని దృష్టిలో ఒక దేవతగా, వనకన్యగా, అప్సరసగా రూపొంది పోతూవుంటే కోర్కెలు మరీ తొందర చేయడం మొదలెట్టాయి. అయితే, రెండు ప్రతిబంధకాలు—ఇటు తన తండ్రి, అటు రత్నం అన్న రాజా. కేవలం మానసిక దౌర్బల్యమేకాక, రత్నాన్ని మనసారా ప్రేమిస్తూ వుండేవాడు.

## 3

ఆ రాత్రి తండ్రి వ్యాపార సందర్భంగా అర్జంటుగా కారులో రాజాతో బెంగుళూరు వెళ్లిపోయారు. ఇదే సమయమని, ఇంతకు మించిన అవకాశం దొరకదని మనసు తొందర చేసింది. బ్రహ్మానందం హృదయం ఒక్కసారి దడదడా కొట్టుకుంది. బోట్ హౌస్ వైపు మెల్లగా కాళ్ళు సాగాయి. నెమ్మదిగా తలుపు తట్టాడు. తలుపు తెరుచుకుంది. ఒకర్నొకరు చూచుకున్నారు. ఆశ్చర్యపోయారు. భయకంపితులైనారు. మ్రాన్పడిపోయారు.

> రాత్రిపూట ఒకపెద్దమనిషి రిక్షాలో వచ్చి చిల్లరదీసి రిక్షావాడికిచ్చాడు.
> "అదేంటి బాబూ! చీకట్లో ఇంత దూరంవచ్చాను. పావలా డబ్బులేనా? రాత్రి పూట ఎవరైనా ఓ అణా డబ్బులు ఎక్కువే యిస్తారు" అన్నాడు రిక్షావాలా.
> "అవునోయ్ అందుకే ఈదీపం దగ్గర ఆపమన్నది" అన్నాడు ఆ పెద్దమనిషి.

బెదురు కంఠంతో "మీరా ?" అనగలిగింది రత్నం.

"ఔను, రత్నం."

"ఈ సమయంలో మీ రిలా రావడం—"

బ్రహ్మానందం అందుకున్నాడు: "ఏమీ బాగులేదని నాకూ తెల్సు. కాని, ఇన్నాళ్లూ వేచివున్న నేను ఇక ఆగలేకపోయాను."

రత్నం ఆ మాటలకు అర్థం తెలీక, బెదురుగా చూస్తోంది. బ్రహ్మానందం తిరిగి "అర్థం కాలేదా" అని కళ్లతోనే ప్రశ్నించి, "రత్నం, నిన్ను చూచిననుండి నీతో ఏదో మాట్లాడుదామనే కోర్కె, నా హృదయం నీ దివ్యరూపంముందు ఒలిచి పెట్టుదామనే వాంఛ గాఢంగా నాలో ప్రవేశించాయి. దూర దూరంగా నిన్ను చూస్తున్నకొద్దీ నా మనస్సు నిన్నుగూర్చి దగ్గర దగ్గరగా ఆలోచించడం మొదలెట్టింది. నన్నే పిచ్చివాడిని చేసేస్తోంది నీ అందం. నా హృదయంలోని భావనకు తగినట్లుగా ఈ సమయంలో మాటలు రావటంలేదు" అన్నాడు.

అనుకోకుండా ఒక పురుషుడు, యువకుడు, అందునా యజమాని కుమారుడు అర్ధరాత్రి సమయాన వచ్చి ఈవిధంగా మాట్లాడుతాడని ఆమె వూహించలేదు. అందుకే ఆ సన్నివేశానికి తట్టుకోలేకపోయింది. బ్రహ్మానందాన్ని చాలాసార్లు ఆమె చూస్తూనే వుంది కాని, ఆమెకు అతనియందు ఎట్టి ఉద్దేశమూ లేదు. కాని, ఈనాడు అతను వచ్చి ఈ మాటలు చెబుతూంటే అనిర్వచనీయమైన అవస్థలో పడిపోయింది.

ఒక తట్టు భయం, ఇంకో తట్టు తీయని అనుభూతి పెనగులాడాయి. ఈలోగా బ్రహ్మానందం అచ్చట వున్న కుర్చీలో కూర్చున్నాడు. అతని నేత్రాలు "నా మాటలు నమ్మటంలేదా రత్నం, ఇంతకన్నా ఎలా చెప్పేది ?" అన్నట్లు జాలిగా చూస్తున్నాయనిపించింది రత్నానికి. అయినా ధైర్యం పుంజుకొని అంది : "క్షమించండి. ఇది మీకు ధర్మంకాదు. మీ అంతస్థెంత, నా అంతస్థెంత ?"

"ఎన్నటికీ నిన్ను అన్యాయం చెయ్యను.

రత్నం, నా మాట నమ్మ."

"దయవుంచి మీరు త్వరగా మీ గదికి వెళ్ళండి. మా అన్నయ్య మంచివాడు కాడు. నన్ను విలువునా చీల్చివేస్తాడు."

"నీ కా భయం అనవసరం. మీ అన్నయ్య రేపటిగ్గాని రాడుగా !" అన్నాడు బ్రహ్మానందం.

"మనమిద్దరమూ ప్రేమించుకొన్న విధంగానే వివాహంకూడా చేసుకోవాలి. ఈ ప్రేమకు అర్థం అప్పుడే. అనాడే మన ప్రేమ అమరం, ఆదర్శం అవుతుంది" అన్నది. ఆమె ఈ మాటలు అనడంతోనే బ్రహ్మానందానికి ముచ్చెమటలు పోశాయి. రత్నం ఇంత తెలివితేటలతోనూ, ముందాలోచనతోనూ మెలగుతుందని అనుకోలేకపోయాడు. రత్నం తనది అవాలనీ, ఆమె అందాన్ని అనుభవించాలనే కోరికతో టక్కున, "ఇదుగో ప్రమాణం చేస్తున్నాను. మన వివాహానికి అడ్డు ఎవరూ రాలేరు" అంటూ రత్నం చేతిలో చెయ్యి వేశాడు. ఆ మాటకోసమే ఎదురుచూస్తున్న రత్నం కళ్ళు ఆనందంతో అరమూతలు పడ్డాయి. బ్రహ్మానందం రత్నాన్ని ఒక్కసారి అక్కున చేర్చుకున్నాడు.

## 4

రోజులు దొర్లిపోతున్నాయి. బ్రహ్మానందం రత్నాన్ని వదలలేకపోయేవాడు. రత్నం అతడే దైవమని భావించేది. వారి యవ్వనంలో కాలవేగం కానవచ్చేదికాదు. అయితే, రాజా పసిగట్టాడు. చెల్లెలు చేసిన పనికి మొదట్లో ఆమెను చంపి, తనూ చచ్చిపోదామన్నంత కోపం వచ్చి, పళ్ళు పట పట కొరికేవాడు. "ఛీ, నీ ముఖం చూడకూడదు నీవు చేసిన ఘనకార్యానికి. నా చెల్లెలు ఒక కులట అవుతుందని నేను అనుకోలేదు."

"అన్నయ్యా !"

"అన్నయ్య ! ఆ మాట అనడానికి సిగ్గులేదూ ?"

"ఇందులో నా తప్పేమీ లేదన్నయ్యా."

"తప్పే లేదూ, చేసేది నీచపని. ఇందులో తప్పులేదు." రాజా కోపం అవధులు దాటిపోతోంది. అయినా, ఒక్క క్షణం ఆలోచించాడు. తన కళ్ళముందు వయసువచ్చిన చెల్లెలు బిక్కపోతూ వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఇందులో తప్పెవరిదో తేల్చుకోసాగాడు. అమాయకురాలైన చెల్లెలి అవస్థ చూచి హృదయం దహించుకుపోయింది.

"గొప్పింటితో ఇలాంటి పొత్తు కుదరదమ్మా. నీవింకా లోకం అనే మాటకు అర్థం తెలీనిదానివి. దీని పర్యవసానం ముందాలోచించలేదమ్మా." రాజా గొంతు బొంగురుపోయింది. చెల్లెలిని అక్కున చేర్చుకొని భోరుమన్నాడు. కాని వెంటనే రాజాకు ఉక్రోషం వచ్చింది. ఆత్మాభిమానం హెచ్చింది. సహోదరి జీవితం ఒక సమస్యగా రూపొందింది. మనస్సు నిలబెట్టుకొని బ్రహ్మానందం గదిలో ప్రవేశిస్తూనే, "నా చెల్లెలిని అన్యాయం చెయ్యదల్చుకున్నారా ?" అని ఖణేలుమని ప్రశ్నించాడు. బ్రహ్మానందం రాజా ఆకృతినీ, అతని ప్రశ్ననూ బట్టి భయపడుతూనే తేరుకొని, జవాబు చెప్పేలోగానే, తిరిగి రాజా, "మీరు మాట నిలుపుకొనేవారైతే తొలిరోజుల్లో రత్నంతో చేసిన బాసలు కార్యరూపంలో పెట్టండి" అన్నాడు.

ఈలోగా బ్రహ్మానందం తండ్రి ఆ గదిలోనికి ప్రవేశించి పరిస్థితిని కొంచెంగా పసిగట్టారు. రాజాకు తన చెల్లెలిని గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న కొద్దీ పిచ్చెక్కిపోతోంది. రక్తం ఉడికిపోతోంది. తన ప్రశ్నకు జవాబు రాకపోవడంతో సహనం చచ్చిపోతోంది. బ్రహ్మానందాన్ని ఒక్క గుద్దుతో చంపెయ్యాలనుకున్నాడు. ముసలాయన అంతలోనే అదో విధంగా రాజావైపు చూచాడు. అందులో ఎంతో అర్థం వుంది. రాజా కోపం చప్పున చల్లారిపోయింది. చిన్నపిల్లవాడిలాగా ఏడుపు లంకించుకున్నాడు.

"ఏమండీ, రత్నం ఇప్పుడు గర్భవతి. దానిని అన్యాయం చెయ్యవద్దు. ధనంలోనూ, అంతస్థుకూ సరితూగక పోవచ్చు కాని, మీలో వున్నదికూడా మానవత్వమే. అన్నయ్యగా నేను ఆమెకోసం కోరే దింకేమీ లేదు."

ఇంకా ఏదో అనబోతుండగానే ముసలాయన "రాజా ! అన్ని సంగతులు అర్థమైనై. అంతటికీ కారణం మావాడి తొందరపాటు.

"ఉద్రేకపడక సాంతం ఆలోచించు రాజా. మా కుటుంబ గౌరవం నిలబెట్టు రాజా. నీకు ఎంత కావాలంటే అంత డబ్బిస్తాను. రత్నాన్ని మద్రాసు తీసుకుపోయి ఆసుపత్రిలో చేర్పించు. పురుడైనాక శిశువును ఆయాకిచ్చెయ్యండి. ఇలాంటివారిని ఏంచెయ్యాలో వాళ్లకు బాగా తెలుసు" అన్నాడు.

ఈలోగా రత్నం గదిలోనికి బాణంలా దూసుకువస్తూ, "డబ్బుతో మా జీవితాలను తూచే ధనికులమాట నమ్మి చెడిపోయింది నేను. మాతృమూర్తి ఎన్నటికీ మీరన్న పని చెయ్యలేదు. అన్నయ్యా ! సరితూగనివారితో సరితూగుదామని భ్రమలోపడ్డ మనలాంటివారి గతి ఇట్లానే వుంటుందని ఇప్పుడే గ్రహించాను" అన్నది. ఆవేశపూరితంగా



ఒక ఇంటికి దూరపుచుట్టంవచ్చి చాలా రోజులు మకాం వేశాడు.ఎంతకూ కదలడు.చివరికి ఒకనాడు ఎలాగో ప్రయాణమైపోయాడు. ఏం లాభం?పదిహేను నిమిషాల్లో తంగోక్కుంటూ తిరిగివచ్చాడు. పీడపోయింది గదా అనుకున్న గృహస్థుకు అతను తిరిగి రావడంలో భయం వేసింది.

బంధువు "ఏదో మరిచిపోయానండి! జ్ఞాపకం రావటంలేదు" అన్నాడు.

ఇంటియజమాని: "మరేంలేదు. వెడతానని చెప్పటం మరిచిపోయి ఉంటారు. ఫరవాలేదు వెళ్లిరండి."




రోజుకి **17 నయాపైసల** ఖర్చుతో

మీ యింట్లోకూడా ఒక గ్రంథాలయం నెలకొల్పుకోవచ్చు

నెలనెలా 5 రూ.ల చొ॥ 18 నెలలు (మొత్తం 90 రూ.లు మాత్రమే!) కడితే:

* మీరు ఏరి కోరుకునే 100 రూ.ల మంచి తెలుగు పుస్తకాలు
* ఉచితంగా మరో 9 పుస్తకాలు
* పుస్తకాభిమానుల అభిమాన పత్రిక 'పుస్తక ప్రపంచం' 18 సంచికలు మీకు లభిస్తాయి
* పోస్టేజి ఖర్చులు ఉచితం
* ఇవికాక యావజ్జీవితం మీరు మరో 5 విధాల సౌకర్యాలు పొందుతారు

ఈ సౌకర్యాలవల్ల మీకు 38 రూ.లు కలిసొస్తుంది

## 'ఇంటింటా స్వంత గ్రంథాలయం ప్రణాళిక'కు

చందాదారులుగా చేరండి

ఇంతవరకూ 4,000 పుస్తకాభిమానులు చేరారు

'ఇంటింటా స్వంత గ్రంథాలయం ప్రణాళిక' గురించి పూర్తి వివరాలు తెలిపే చిన్న పుస్తకం **ఉచితంగా** కావాలంటే ఈ క్రింది అడ్రసుకు రాయండి

ఇంటింటా స్వంత గ్రంథాలయం ప్రణాళిక
c/o ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
రాష్ట్రపతి రోడ్
సికింద్రాబాద్. ఎ.పి.

పుస్తక ప్రచురణలో 87 ఏండ్ల అనుభవంగల ఎం. శేషాచలం అండ్ కంపెనీ (బందరు, సికింద్రాబాద్, మద్రాసు) వారు 'ఇంటింటా స్వంత గ్రంథాలయం ప్రణాళిక'ను ప్రారంభించి నిర్వహిస్తున్నారు

వెలువడ్డ రత్నం మాటలు రాజాలో అణిగి పోయిన కోపాగ్నిని తిరిగి బయటపెట్టాయి.

"ఇదుగో బ్రహ్మానందం, మా చెల్లెలు నిజాయితీపై నిలబడ్డ వ్యక్తి. దాన్ని దుఃఖంలో ముంచి మీరు బాగుపడే దేమీ లే దీ ప్రపంచంలో. ఈనాడు నాలో సహనం ఎంతో కొంత మిగిలివుండటాన బ్రతికి పోయావు."

"పదన్నయ్యా! ఈ వూరు వదిలిపోదాం. మన పరువు నిలబెట్టుకోలేకపోయినా, పిల్ల ప్రతిష్ఠకు భంగం కలగ్గూడదు కదా!"


అన్నా, చెల్లెలూ నిష్క్రమిస్తూ వుంటే తండ్రీ కుమారులు చూస్తూ నిల్చుండి పోయారు.

## 5

కాలచక్రంలో ఇరవై ఏళ్లు తిరిగిపోయాయి. ముసలాయన దివంగతుడైనాడు గౌరవానికి భంగంలేకుండానే. బ్రహ్మానందం ఏకాకి. ఆనాడు తత్తరపాటులో తను నోరెత్తలేక పోయాడు. ఏదో చెప్పాలనుకొంటూనే చెప్ప లేకపోయాడు. ఈలోగా రత్నం, రాజా ఇల్లు వదిలిపోవడంగూడా జరిగిపోయింది. తిరిగి రత్నాన్ని వెదికినా ప్రయోజనంలేదు. ఆమె మనస్సు ఏలాంటిదో అతనికి తెలుసు. దీర్ఘంగా ఆలోచించుకొని, జీవితమంతా అవివాహితుడుగానే వుండిపోయాడు. తను అనుకొని తృప్తిజెందిందొక్కటే — "రత్నం బ్రతికివున్నా, చనిపోయినా, నేను వివాహమే చేసుకోలేదని ఆమె ఆత్మ భావిస్తే అదే చాలు" అని. రోజులు, సంవత్సరాలు నిర్జీవంగా దొర్లిస్తున్న బ్రహ్మానందం ఈనాడు ఏభైయ్యో ఏడిలో వున్నాడు అంత పెద్ద బంగళాలోనూ ఏకాకిగా!

## 6

పురోహితుడు మంగళసూత్రాన్ని బ్రహ్మానందంగారి వద్దకు తెచ్చి కళ్లు మూసుకొని వున్న వైనం గమనించి "బాబూ" అని పిలిచాడు. పురోహితుని పిలుపుతో ఒక్కమాటు ఆలోచనా ప్రపంచంలో నుంచి బ్రహ్మానందంగారు తేరుకున్నారు. ఎదురుగా పురోహితుడు, అతని చేతిలో మంగళసూత్రం కన్పించాయి. రత్నానికి ఒకవేళ ఆడపిల్లే పుట్టి బ్రతికివుంటే, సరిగ్గా పెళ్లికూతురు వయస్సులోనే వుంటుందన్న ఆలోచన చటుక్కున కలిగింది. కళ్లలో నీరు గిర్రున తిరగడంతో కండువా కొనతో తుడుచుకున్నారు. అయినా, దుఃఖంమూ ముంచుకొస్తుండడంతో, నోరుకు కూడా అడ్డు పెట్టుకొంటూ చరచరా బయటికి వెళ్లిపోయాడు.



'కమలా నెహ్రూ పార్కు' (బొంబాయి)

— ఫొటో: డాక్టర్ కె. కృష్ణమూర్తి

ఇదంతా గమనిస్తున్న అందరూ "బ్రహ్మానందంగారూ, అదేమిటండీ" అని ఆయన వెంట పడ్డారు. పెళ్లిపెద్ద కనకారావుగారు ఆయన్ను అడ్డుకొని, "అన్నగారూ, పిల్ల పెళ్లి శుభప్రదంగా జరిగిపోనియ్యండి. మీ ఆశీర్వాదం లేకపోతే ఎలా చెప్పండి?" అని ప్రాధేయపడ్డాడు.

"నీకు నా బాధ అర్థంకాదు కనకారావూ, చెప్పే స్థితిలోకూడా లేను" అని బ్రహ్మానందంగారు చెప్పగానే, "నిజమే, కష్టాలు అందరికీ వస్తుంటాయి. లగ్నం సమీపించింది. కన్య మెళ్లో ఆ మూడు ముళ్లూ పడనియ్యండన్నగారూ. తర్వాత అన్నీ సావకాశంగా చూచుకుందాము" అన్నాడు ఆయన. తక్కిన పెద్దలంతా కూడా పెళ్లిపెద్దను సమర్థించారు. కన్యాదాత ఏ మాలోచించుకున్నాడో కాని "కన్న మమకారంకన్నా, పెంచిన మమకారం చాల పవిత్రమైంది. ఎప్పుడో ఈ రహస్యం మీ అందరికీ చెప్పెయ్యక తప్పదు. అందుకు ఇంతకన్నా మరో శుభసమయం రాదు" అన్నాడు.

"వధువు నా స్వంత కూతురు కాదు. తల్లి పేరు రత్నం. ఆ మహాతల్లి పిల్లను కనగానే పోయింది. పిల్ల మేనమామ పెంచుతూ వచ్చాడు నాలుగు సంవత్సరాల వరకు. అనుకోకుండా అతన్ని నేను ఓనాడు ట్రెయిన్‌లో కలవడమూ, పిల్ల అందమైందీ, చురుకైనదీ, మాకు పిల్లలు లేక పోవడమూ అన్నీ కలిశాయి. ఈవిధంగా నా కూతురే అయింది" అని కన్యాదాత ఆనందాశ్రువులు తుడుచుకొన్నాడు. బ్రహ్మానందం కళ్లు బైర్లు కమ్మాయి. హృదయంలో సమ్మెటపోటు ప్రారంభమైంది. వణుకుతున్న చేతులతో వధూవరులను దీవించాడు.

## 7

ఆరాత్రే బ్రహ్మానందంగారు తన వకీలును రప్పించి వీలునామా పూర్తి చేయించారు.

దాని సారాంశం ఒక్కటే — ఆయన అనంతరం ఆయన యావదాస్తీ కనకారావుగారి పెంపుడు కూతురుకే చెందాలని. ✱